ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
7
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 2 ఫిబ్రవరి 2025



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి.. రథసప్తమి వేడుకలకు ముస్తాబైంది. కూటమి ప్రభుత్వం తొలిసారిగా 'రథసప్తమి'ని రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 2, 3, 4 తేదీల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా, సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా కార్యక్రమాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్ టూరిజం, లేజర్ షో నిర్వహించనున్నారు. బుల్లితెర ప్రముఖులతో ప్రదర్శనలు, సినీ సంగీత విభావరి, నృత్యరూప ప్రదర్శనలకు సన్నాహాలు చేస్తున్నారు. ఉత్సవాలకు లక్షలాది మంది తరలిరానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



డచ్ బిల్డింగ్ వద్ద సిద్ధంగా ఉన్న హెలికాప్టర్

- నేటి నుంచి రథసప్తమి ఉత్సవాలు
- మూడు రోజులపాటు నిర్వహణ
- ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు
- సామూహిక సూర్యనమస్కారాలతో శ్రీకారం
- ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్ టూరిజం, లేజర్ షో



తొలిసారిగా హెలికాప్టర్ టూరిజం అందుబాటులోకి తెచ్చారు. కలెక్టరేట్ సమీపాన డచ్ బిల్డింగ్ వద్ద నేటి నుంచి మూడు రోజులపాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు హెలికాప్టర్ రైడ్ ఉంటుంది.



అరసవల్లిలో విద్యుత్ వెలుగులు

భక్తులారా.. రారండి!

అరసవల్లి/ శ్రీకాకుళం అర్బన్/ ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లిలో శ్రీ సూర్యనారాయణ స్వామి జయంతిని పురస్కరించుకుని రథసప్తమి వేడుకలకు రంగం సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం నుంచి మూడురోజుల పాటు వైభవంగా వేడుకలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 80 అడుగుల రోడ్డులో 6 గంటలకు సామూహిక సూర్యనమస్కారాలతో వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు.

- ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ మునిసిపల్ స్కూల్ మైదానంలో గ్రామీణ క్రీడా పోటీలు ప్రారంభమవుతాయి. వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, కర్రసాము, సంగిడీలు, ఉలవల బస్తా లిఫ్టింగ్, పిల్లి మొగ్గలు వంటి పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు.
- మధ్యాహ్నం 2.30 గంటలకు డేఅండ్‌నైట్ జంక్షన్ నుంచి నమూనా రథాలతో ర్యాలీ ప్రారంభించి.. అరసవల్లి ఆలయం వరకూ శోభాయాత్ర నిర్వహిస్తారు. జానపద కళారూపాలు, కోలాటం, తప్పెటగుళ్లు, థింసా నృత్యం వంటి ప్రదర్శనలతో శోభాయాత్ర సాగనుంది.
- సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 వరకు ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్, దుంపల ఈశ్వర్, యామినీకృష్ణ, పరిమళ, అనురాధ, లక్ష్మి గణపతి శర్మ బృందాల ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నారు. బుల్లితెర నటులు హైపర్ ఆది, పైమా, డీ భూమిక, రేలారే రేలా టీమ్, మిమిక్రీ ఆనంద్, జోష్ శివ, పిన్ని సాంగ్ ఫేమ్ షన్ముఖ, సురేష్ రేష్మా, బాలాజీ వంటి ప్రముఖుల ధూంధాం కార్యక్రమాలు జరుగుతాయి.
- రాత్రి 7 నుంచి 8 గంటల వరకు లేజర్ షో ప్రదర్శిస్తారు. రాత్రి 9 గంటలకు శ్రీ అంజనా కళా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ నటీనటులతో పంచరత్నాలు పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుంది. మయసభ పడక సీను, శ్రీరామాంజనేయ యుద్ధం, భక్త చింతామణి, గయోపాఖ్యానం, శ్రీ సత్య హరిశ్చంద్ర వారణాశి నుంచి ప్రారంభం వంటి నాటకాలు ప్రదర్శిస్తారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎడ్ల గోపాలరావు ఆధ్వర్యంలో పౌరాణిక నాటిక నిర్వహిస్తారు. నీరజా సుబ్రహ్మణ్యం, రఘుపాత్రుని శ్రీకాంత్ ఆధ్వర్యంలో నృత్యరూపక ప్రదర్శనలు జరగనున్నాయి. అలాగే కల్లేపల్లి గురుకులం సంప్రదాయం డైరెక్టర్ స్వాతి సోమనాథన్ ఆధ్వర్యంలో యోగాపై నృత్య రూపకం ప్రదర్శిస్తారు. మంగళవారం రాత్రి ప్రముఖ గాయని మంగ్లీ ఆధ్వర్యంలో సినీ మ్యూజిక్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
- ఆర్ట్స్ కళాశాల మైదానంలోనే ఫుడ్ కోర్టులు అందుబాటులో ఉంచారు. కోడిరామ్మూర్తి స్టేడియంలో పార్కింగ్, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

రథసప్తమి వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఎస్పీ వివేకానందతో చర్చించి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. 80 అడుగుల రోడ్డులో సూర్యనమస్కారాల ఏర్పాట్లు, మిల్లు జంక్షన్ వద్ద సుందరీకరణ పనులు, ఆర్ట్స్ కళాశాలలో స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్ మైదానంలో జరగబోయే క్రీడలకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు కె.సాయి ప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఆదిత్యాలయం ఆవరణలో ఏర్పాట్లు..

సప్తమి నాటికి పూర్తయ్యేనా?

- కొనసాగుతున్న 'రథసప్తమి' పనులు
- అధికారుల మధ్య సమన్వయ లోపం
- ఏర్పాట్లపై కొరవడిన స్పష్టత ● వీఐపీ పాసుల రద్దు
- క్యూలైన్లలోనే టిక్కెట్ల విక్రయాలు
- ఇంకా జారీ కాని పాసులు
- అయోమయంలో ఆలయ అధికారులు



కొనసాగుతున్న క్యూలైన్ల పనులు

అరసవల్లి/ శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి ఉత్సవాల సందర్భంగా నగరంలో ప్రారంభించిన అనేక పనులు ఇంకా పూర్తి కాలేదు. సుందరీకరణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆలయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, పోలీసులకు మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. స్థానిక డే అండ్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల జంక్షన్ వరకు సుందరీకరణ పేరుతో చెట్లను నరికేసి, డివైడింగ్ లైన్లను తొలగించారు. వాటి స్థానంలో కొత్తగా చేపట్టిన పనులు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. అలాగే డే అండ్ నైట్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలి మీదుగా మిల్లు జంక్షన్, అరసవల్లి ఆలయం వరకు చేపడుతున్న సుందరీకరణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. పాలకొండ రోడ్డులో శనివారం రాత్రికి కూడా డివైడర్ నిర్మాణ పనులు జరుగుతూనే ఉన్నాయి. కొన్నిటికైతే ఓ వైపు నిర్మాణాలు చేపడుతూనే.. ఇంకోవైపు రంగులు, సున్నాలు వేసేస్తున్నారు. ఇంత హడావుడిగా చేపడుతున్న ఈ నిర్మాణాల్లో నాణ్యతపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పనులతో ఓ వైపు ట్రాఫిక్ ఇబ్బందులు... మరో వైపు దుమ్ము, ధూళితో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

● అధికారుల మధ్య సమన్వయ లోపం..

జిల్లాలోని వివిధ శాఖల అధికారులకు, ఆలయ అధికారులకు మధ్య సమన్వయం ఉండడం లేదు. ఈ నెల 2, 3, 4, తేదీల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 2వ తేదీ నుంచి 3న రాత్రి వరకు వివిధ క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా అధికారులతో పాటు, ఆలయ అధికారులు వీటికి హాజరుకాక తప్పదు. వీటిపై ఆలయ అధికారులకు స్పష్టత లేకపోతోంది. ఉత్సవ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ శనివారం వరకు పాసులు, టిక్కెట్ల విషయంలో స్పందించకపోవడం గమనార్హం. ఏటా అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి దాతలు, వీఐపీలు, వీవీఐపీలు, ఉచిత దర్శనాలపై ప్రణాళిక రూపొందించే వారు. ఈ ఏడాది అటువంటి సమావేశాలు ఆలయంలో నిర్వహించడం కానీ, పనులపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవడం కానీ కనిపించలేదు.

● వీఐపీ పాసుల రద్దు..

రథసప్తమి వేడుకలకు వచ్చే వీఐపీల కోసం ఏటా ఆలయ అధికారులు (మిగతా 8వ పేజీలో..)

పాసుల కోసం దాతల అవస్థలు | హెలికాప్టర్ విహారానికి సర్వం సిద్ధం | సూర్య నమస్కారం.. ఆరోగ్య 'యోగ'ం!

● నేడు 80 అడుగుల రోడ్డులో 5000 మందితో ప్రదర్శన 8లో

వ్యర్థాలను విడిచిపెడుతున్న పరిశ్రమలకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రణస్థలం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను శుద్ధి చేయకుండా కందివలస గెడ్డలో విడిచిపెడుతున్న పైడిభీమవరం పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలకు కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. గతేడాది నవంబరు 23న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఉపాధి లేదు కాలుష్యమే' అన్న కథనంపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్య, విశాఖ జోనల్ అధికారి కె.రమేష్, ఈఈ బి. కరుణశ్రీ స్పందించి అదే నెల 28న పైడిభీమవరంలో పర్యటించిన విషయం తెలిసిందే. కందివలస గెడ్డ, పరిసర ప్రాంతాలను క్షుణంగా పరిశీలించి శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపారు. వ్యర్థాలను శుద్ధి చేసిన తరువాత గెడ్డలో విడిచిపెట్టాలని పరిశ్రమలకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. దీంతో గతేడాది డిసెంబరు 31న కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమగ్ర విచారణ చేపట్టింది. వ్యర్థాలను శుద్ధి చేయకుండా గెడ్డలోకి విడిచిపెడుతున్నట్లు తేల్చింది. ల్యాబ్ రిపోర్టులో కూడా ఇదే ఉండడంతో సంబంధిత పరిశ్రమలపై చర్యలకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈఈ బి.కరుణశ్రీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తోంది.

పోలీసుల అదుపులో అనుమానితుడు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్థినిపై దాడి ఘటనలో అనుమానితుడిని ఒకటో పట్టణ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్న కొరికాన లక్ష్మిపై గురువారం రాత్రి దాడి జరిగిన విషయం తెలిసిందే. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ దాడికి పాల్పడిన అనుమానితులపై ఆరా తీశారు. మరోవైపు ఈ ఘటనను రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ సీరియస్‌గా తీసుకున్నారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి, విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. దీంతో పోలీసులు దర్యాప్తును మరింత వేగవంతం చేశారు. బాధితురాలి సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ ట్రేస్ చేయగా.. ఆ ఫోన్ ఒక బస్సులో ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఆ సెల్‌ఫోన్‌లో సమాచారం ఆధారంగా అనుమానితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగులకు భారీ ఊరట



- రైతులకు చేకూరనున్న లబ్ధి
- 'జల్‌జీవన్' పనులు మరో మూడేళ్లు కొనసాగింపు
- జిల్లా ఆసుపత్రిలో 'డే కేర్ కేన్సర్' సెంటర్
- కేంద్రబడ్జెట్‌పై అధిక వర్గాల్లో హర్షం

శ్రీకాకుళం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌పై ప్రధానంగా ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. శనివారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్.. జిల్లాకు ఊరటనిచ్చేలా ఉందని పలువురు పేర్కొంటున్నారు. రూ.12లక్షల వరకు ఆదాయ పన్ను విధింపు లేకపోవడంతో జిల్లాలో 32వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట లభించిందని చెబుతున్నారు. రాష్ట్రానికి భారీ లబ్ధి చేకూరిందని (మిగతా 10వ పేజీలో..)

వ్యవసాయ రంగానికి ఉత్తేజం



ఎన్డీఏ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని రుజువైంది. రైతులు, మహిళలు, యువత, మధ్యతరగతి ప్రజలకు లబ్ధి కలిగేలా కేంద్ర బడ్జెట్ ఉంది. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రూ.3 లక్షల నుంచి రూ. 5లక్షలకు రుణపరపతిని పెంచడం, మత్స్య సంపద అభివృద్ధికి చేయూత ఇవ్వడం, అస్సాంలో యూరియా ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం తెలపడం శుభపరిణామం. ఇది వ్యవసాయ రంగానికి మరింత ఉత్తేజం ఇస్తుంది.

- కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి

శుభపరిణామం



ఎంఎస్ఎంఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కేంద్ర బడ్జెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకోవడం హర్షనీయం. ఎంఎస్ఎంఈలకు ఇచ్చే రుణాలు రూ.5కోట్ల నుంచి రూ.10 కోట్లకు, స్టార్టప్‌లకు ఇచ్చే రుణాలు రూ.10కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెంపు, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు రూ.10 వేల కోట్లతో నిధి ఏర్పాటుకు నిర్ణయించడం శుభపరిణామం.

- డాక్టర్ ఎం.సూరిగణేష్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి, ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం

హర్షణీయం



ఇన్నాళ్లికి కేంద్ర ప్రభుత్వం వేతన జీవులకు ఊరట ఇచ్చేలా నిర్ణ యం తీసుకుంది. రూ.12లక్షల ఆదాయం వరకు పన్ను లేదని బడ్జెట్‌లో ప్రకటించడం హర్షణీయం.

- హనుమంతు సాయిరాం, జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు



మల్లన్నపాగాను సిద్ధం చేస్తున్న చేనేత కార్మికులు

'మల్లన్నపాగా'కు శ్రీకారం

పొందూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికామాతకు పొందూరు నుంచి ప్రత్యేకంగా సమర్పించే మల్లన్నపాగా చేనేతవస్త్రం నేతకు శనివారం శ్రీకారం చుట్టారు. ఏటా శివరాత్రికి శ్రీశైలం దేవస్థానానికి ప్రత్యేకంగా వస్త్రం సమర్పించడం ఆనవాయితీ. ఈఏడాది మల్లన్నకు చేనేత పాగా నేసే అవకాశం పొందూరులోని లావేటివీధికి చెందిన బనిశెట్టి ఆంజనేయులకు లభించింది. దీంతో ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం నేత పనులు ప్రారంభించారు. మల్లన్నకు పాగాతోపాటు భ్రమరాంబకు పట్టుచీర, బసవన్నకు, గణపతికి ప్రత్యేక వస్త్రాలు నేసి మహాశివరాత్రికి అందిస్తారు.

పథకం ప్రకారమే హతమార్చారు

- జిల్లాలో వీడిన రెండు హత్యకేసుల మిస్టరీ
- వివాహేతర సంబంధాలే కారణమని నిర్ధారణ
- పలాస, ఆమదాలవలసలో ఘటనలు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీలు 10లో

పాసుల కోసం దాతల అవస్థలు

- ఆదిత్యాలయంలో గంటల తరబడి పడిగాపులు
- కానరాని కనీస వసతులు
- పట్టించుకోని ఆలయ అధికారులు
- అసహనం వ్యక్తం చేసిన డోనర్స్

అరసవల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): చిన్న ఆలయంగా ప్రారంభమై నేడు ఆలయ గర్భగుడి, అనివెట్టి మండపం తదితర నిర్మాణాలకు, అభివృద్ధికి కారణమైన దాతలు రథసప్తమి పాసుల కోసం పడుతున్న పాట్లు వర్ణనాతీతం. ఇన్నేళ్లలో ఎన్నడూ లేని విధంగా లక్షలాది రూపాయలు విరాళంగా అందజేసి, ఆలయం ఈ స్థాయికి చేరుకోవడానికి కారకులైన దాతలు పాసుల కోసం గంటల తరబడి వేచి ఉన్నా మోక్షం కలగని దీన పరిస్థితి వారికి ఎదురైంది. రథసప్తమి ఉత్సవాలకు సంబంధించి దాతలకు ఇచ్చే పాసుల విషయమై ఆలయ చరిత్రలో తొలిసారిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే నిబంధన విధించారు. దీంతో దేశం నలుమూలలా ఉన్న దాతలు వ్యయప్రయాసలతో ఆలయానికి చేరుకుని తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. నిజానికి దాతలు అనేవారు ఆర్థికంగా, సామాజికంగా ఎంతో ఉన్నత స్థానాల్లో ఉంటారు. అటువంటి దాతల పాసుల కోసం శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు రావాలని ఆలయ అధికారులు సమాచారం ఇవ్వడంతో పెద్ద ఎత్తున దాతలు ఆలయ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే సాయంత్రం 5.00 గంటల తర్వాతే పాసుల జారీ ఉంటుందని, అంతవరకు వేచి ఉండాలనడంతో వారంతా అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం 5.00 గంటలకు ప్రారంభమైన పాసుల జారీ ప్రక్రియలో భాగంగా దాతల పేర్లు, రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారి పేర్లతో సరిపోలకపోవడంతో వారికి పాసులు జారీ చేయాలేదు. కంప్యూటర్‌లో తమ పేరు, ఆధార్ కార్డులో పేరు, అలాగే విరాళాలు అందజేసిన రశీదులో పేరు ఒకేలా ఉన్నా, రిజిస్ట్రేషన్‌లో పేర్లను తప్పుగా ఆలయ సిబ్బంది నమోదు చేయడంతో ఏం చేయాలో తెలియక వారు అధికారులతో వాగ్వాదానికి దిగారు. లక్షల రూపాయాలు విరాళాలను అందజేసిన తమకు ఏమిటీ ఖర్మ అంటూ వాపోయారు. చాలామంది దాతల పేర్లు రిజిస్ట్రేషన్లలో ఎందుకు తప్పుగా నమోదు చేశారు? ఇందులో మతలబు ఏమిటో అని పలువురు గుసగుసలాడుకోవడం కనిపించింది. దాతలు కూర్చునేందుకు కుర్చీలు గానీ, కనీసం తాగేందుకు మంచినీరు కూడా సరఫరా చేయకపోవడం బాధాకరం. సమాజంలో ఎంతో గౌరవ, మర్యాదలతో బతికే తమకు ఈ ఖర్మ ఏంటి స్వామి అంటూ వారు విచారం వ్యక్తం చేశారు. ఇక జన్మలో ఒక్కపైసా కూడా ఆలయానికి ఇచ్చేది లేదని, లక్షల విరాళాలు అందజేసి ఇప్పటికే తప్పు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు.



ఆలయ అధికారులను ప్రశ్నిస్తున్న దాతలు

హెలికాప్టర్ విహారానికి సర్వం సిద్ధం

- ఒక్కొక్కరికి రూ.1800 టిక్కెట్
- ఆన్‌లైన్‌లోనే విక్రయం

శ్రీకాకుళం క్రైం/అరసవిల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకల్లో భాగంగా జిల్లాలో తొలిసారిగా ఏర్పాటు చేసిన హెలికాప్టర్ టూరిజం ద్వారా సామాన్య భక్తులు సైతం సిక్కోలు నగరాన్ని గగనతలం నుంచి వీక్షించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని డ్వామా పీడీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్ వద్ద గల డచ్ బిల్డింగ్ వద్ద ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు హెలీకాప్టర్‌లో విహరించే అవకాశాన్ని కల్పించారు. ఆన్‌లైన్‌లో హెలిరైడ్ అరసవల్లిసన్‌గాడ్.ఓఆర్‌జీ వెబ్‌సైట్లో ఒక్కొక్కరికి రూ.1800 చెల్లించి టిక్కెట్ తీసుకోవాలని, ఇప్పటివరకు 72 మంది పొందారన్నారు. ఎనిమిది నిమిషాల పాటు సిక్కోలు గగనతలంపై విహరించవచ్చన్నారు. ఈ టిక్కెట్లను కేవలం ఆన్‌లైన్‌లో సూచించిన వెబ్‌సైట్‌లో నగదు చెల్లించి టిక్కెట్ పొందాలన్నారు. ఈ నెల 2, 3, 4 తేదీల్లో హెలీకాప్టర్‌లో విహారం ఉంటుందని స్పష్టం చేశారు.

నెమలి పింఛంపై స్వామివారు..

శ్రీకాకుళం కల్చరల్ ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అరసవల్లి రథసప్తమి వేడుకలు సందర్భంగా చిత్రకారుడు వాడాడ రాహుల్ పట్నాయక్ నెమలి పింఛంపై సూర్యనారాయణ స్వామి మూలవిరాట్ చిత్రాన్ని వేశాడు. అదేవిధంగా రావి ఆకుపై కూడా ఇదే చిత్రాన్ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దాడు. రథసప్తమి రోజున ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మకు వీటిని అందజేస్తానని తెలిపారు. కాగా రాహుల్ ఇటీవల విశాఖలో జరిగిన ఓ కార్యక్రమంలో వడ్డాది పాపయ్య స్మారక పురస్కారాన్ని అందుకున్నాడు.



సూర్య నమస్కారం.. ఆరోగ్య 'యోగ'ం!

- ఆదిత్యుని ఆలయంలో నిత్యం నిర్వహణ
- నేడు 80 అడుగుల రోడ్డులో 5000 మందితో ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత సూర్యభగవానుడు లేలేత కిరణాలతో జగతిని మేల్కొలిపి.. సకల జీవరాశికి ఆయురారోగ్యాలు ప్రసాదిస్తుంటాడు. ఆదిత్యుడిని నమస్కార ప్రియుడిగా పేర్కొంటారు. ప్రత్యక్ష దైవానికి నిత్యం నమస్కారం చేస్తే కరిగిపోతాడు. సర్వరోగాలను హరించి జీవితానికి కొత్త వెలుగును ప్రసాదిస్తాడని భక్తుల విశ్వాసం. అందుకే అరసవల్లి ఆలయంలో సూర్య నమస్కారాలు, పూజలను ప్రత్యేకంగా చేస్తుంటారని అర్చకులు దర్భముల్ల రామకృష్ణ తెలిపారు. ప్రతి రోజు అనివెట్టి మండపంలో భక్తులు సూర్యనారాయణ స్వామిని కొలుస్తూ వివిధ రకాల పూజలు చేస్తుంటారు. రామకృష్ణ 9 తొమ్మిది రకాల సూర్య నమస్కార ఆసనాలతో పూజలు చేస్తారు. ఆ విధంగా పూజలు చేస్తే అనేక రుగ్మతలు పోయి... సకల ఐశ్వర్యాలు కలుగుతాయని రామకృష్ణ అంటున్నారు. సూర్య నమస్కారం, హస్త ఉత్తానసనం, పర్వతాసనం, భుజంగాసనం, పాదహస్తాసనం, మాకరాసనం, వజ్రాసనం, అష్టాంగ నమస్కారాసనం, అశ్వసంచాలనాసనం, ప్రజారాసనాలు వేస్తామని రామకృష్ణ తెలిపారు. ఇదిలా ఉండగా... ఈ నెల 2న (ఆదివారం) శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో సుమారు 5000 మందితో ప్రత్యేకంగా సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాలో ఉన్న యోగా గురువులు, పండితులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు డాక్టర్ జగదీష్ తెలిపారు.




పర్వతాసనం



హస్త ఉత్తానసనం



సూర్య నమస్కారాసనం



అశ్వ సంచాలనాసనం



భుజంగాసనం

రథసప్తమికి కట్టుదిట్టమైన బందోబస్తు

- ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం/అరసవల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భక్తులు ప్రశాంతంగా సూర్యనారాయణ స్వామి వారిని దర్శించుకునేలా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలని జిల్లా పోలీసు యంత్రాంగానికి ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా అరసవిల్లి ఆలయం, క్యూ లైన్లు, టిక్కెట్లు, ప్రసాదం విక్రయ కేంద్రాలు, పార్కింగ్ ప్రాంతాలు, హెలీపాడ్, సూర్య నమస్కారాల సభ, ఆర్ట్స్ కళాశాల మైదానంలో కార్యక్రమాలకు సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లను శనివారం ఎస్పీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. 2, 3, 4 తేదీల్లో నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. 2,300 మంది పోలీసు సిబ్బందికి విధులు కేటాయించడంతో పాటు, అరసవల్లి తోటలో వారికి ఎస్పీ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వివేకానంద, సీఐలు పైడపునాయుడు, నాగరాజు, ఎస్ఐ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బందోబస్తు ఏర్పాట్లపై శనివారం రాత్రి జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో ఎస్పీ సమీక్షించారు.



క్యూలైన్లను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

సప్తమి నాటికి పూర్తయ్యేనా?

(ఏడో పేజీ తరువాయి)

ప్రత్యేకంగా పాసులు జారీ చేసేవారు. ఈ ఏడాది ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి కారణంగా ఈ పాసుల మంజూరుకు బ్రేక్ పడింది. కేవలం దాతలకు మాత్రమే శనివారం పాసులు మంజూరు చేశారు. దీంతో క్షీరాభిషేకం, ప్రత్యేక దర్శనాల కోసం రూ.500 (ఇద్దరికి మాత్రమే), రూ.300(ఒక్కరికి మాత్రమే) టిక్కెట్లను దేవదాయ శాఖ అధికారులు చివరి నిమిషంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ టిక్కెట్లు కూడా 3న అర్ధరాత్రి దాటిన తరువాత క్యూలైన్లలోనే విక్రయించేందుకు అధికారులు నిర్ణయించారు.

ప్రసాద విక్రయ కేంద్రాలపైనా సందిగ్ధం..

రథసప్తమి సందర్భంగా భక్తులు ఈ నెల 2, 3, 4 తేదీల్లో స్వామి వారిని దర్శించుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. 2,3, తేదీల్లో భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని అంచనా వేస్తున్నారు. క్యూలైన్ల పనులు ఇంకా కొనసాగుతుండడంతో భక్తులు స్వామి వారి దర్శనానికి ఎలా వెళ్లాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. మరోవైపు ప్రసాదం విక్రయాల కౌంటర్లను కూల్చేశారు. గత ఏడాది సుమారు 60 వేలమంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. ఈ ఏడాది సుమారు లక్షకు పైగా వస్తారన్న అంచనాలున్నాయి. ప్రసాదాల విక్రయ కేంద్రాల ఏర్పాటు విషయంపై నేటికీ స్పష్టత లేదు.

స్నానాల గదులు ఏవీ?

ఆలయం ఎదురుగా గల ప్రాంతంలో, కేశఖండన శాల వెనుక భక్తుల కోసం స్నానాల గదులు, మరుగుదొడ్లు ఉండేవి. పుష్కరిణిలో స్నానం చేసేవారు ఈ గదుల్లో దుస్తులు మార్చుకునే వారు. కానీ రథసప్తమి ప్రత్యేక ఏర్పాట్ల పేరుతో వాటన్నింటినీ తొలగించారు. వీటికి సంబంధించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు.

మిల్లు జంక్షన్ వద్ద నిర్మాణానికి సవాళ్లెన్నో..

స్థానిక మిల్లు జంక్షన్ వద్ద నూతన నిర్మాణం చేపట్టి అక్కడే గల బాబూజగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ముందుకు జరిపి... ఆకర్షణీయమైన ఫౌంటేన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ నిర్మాణం చేపట్టిన తరువాత రెండుసార్లు వాటిని కూల్చేసి... మళ్లీ రెండు రోజుల క్రితం కొత్తగా నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో అధికారులకు దీనిపై స్పష్టత ఉందోలేదోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం రాత్రికే పూర్తి చేసి... ఆదివారం ఉదయానికి సిద్ధం చేయాలని చూస్తున్నారు. మరి దీని నాణ్యత ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.



మిల్లు జంక్షన్‌లో ఇంకా సాగుతున్న పనులు

పవర్‌ప్లాంట్‌పై అపోహలు వద్దు: ఎమ్మెల్యే కూన


సరుబుజ్జిలి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పించేందుకు నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ పరిసర ప్రాంతాల్లో ప్రతిపాదించిన జెన్‌కో థర్మల్ పవర్ ప్లాంట్‌పై అపోహలు వద్దని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం వీరమల్లిపేట గ్రామం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమలు లేక రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్ర స్థాయిలో ఉందని, శ్రీకాకుళం జిల్లాతో పాటు ఆమదాలవలస నియోజకవర్గంలో కూడా ఎంతో మంది యువత ఉపాధి అవకాశాలు కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబును అభ్యర్థించి ఈ ప్రాంతంలో ఒక పవర్‌ప్లాంట్ నిర్మాణానికి ప్రతిపాదించడం జరిగిందన్నారు. ఆదిలోనే కొంతమంది దీనిని రాజకీయం చేస్తూ ఆ ప్రాంత ప్రజలను తప్పుదోవ పట్టించి అపోహలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలు నియోజకవర్గ అభివృద్ధితో పాటు భావితరాల భవిష్యత్తు గూర్చి ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం జరగనున్న ఈ పవర్‌ప్లాంట్ ద్వారా ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలకు గిరిజనులకు అన్ని విధాలా న్యాయం చేయడం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

అంబేడ్కర్‌కు జీవిత సాఫల్య పురస్కారం

గుజరాతీపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాగోలులో గల జెమ్స్ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అంబేడ్కర్‌కు జీవిత సాఫల్య పురస్కారం లభించింది. శనివారం విశాఖలో జరిగిన ఓఎస్ఎస్ఏపీ ఆధ్వర్యంలో జరిగిన ఆర్థోపెడిక్ సదస్సులో ఈ పురస్కారాన్ని కోయంబత్తూరులో గల గంగా హాస్పిటల్ ప్రొఫెసర్ డి.రాజశేఖరన్ చేతులు మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో జెమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఉదయ్‌కుమార్, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నైతిక విలువలు అవసరం

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ నైతిక విలువలు కలిగి ఉండాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి అన్నారు. రెండో రోజు శనివారం బాపూజీ కళామందిర్‌లో ఉదయం సంస్కార సుధ అనే అంశంపై ప్రసంగించారు. లలితా పీఠం అర్చకులు పెంట రామచంద్రశేఖర్ శర్మ, కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపనిష్మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్, ప్రతినిధులు ఎన్.నర సింహమూర్తి, పతంజలి శాస్త్రి, పొట్నూరు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

గార, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్వేతగిరిపై వెలసిన వీరవసంత ఈశ్వర స్వామి వారి దేవాలయం (అయ్యప్ప, అభయాంజనేయ స్వామి ఆలయాలు) ప్రథమ వార్షికోత్సవం శనివారం వైభవంగా ప్రారంభించారు. మూడు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం ఇతర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మహేంద్రాడ రవికుమార్, వసుంధర దంపతులు ఆధ్వర్యంలో పండితులు అంపోలు రుద్రకోటేశ్వర శర్మతోపాటు పలువురు రుత్వికులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న అర్చకులు, భక్తులు

నిందితులను కఠినంగా శిక్షిస్తాం: ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి/క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని బీసీ వసతి గృహంలో విద్యార్థినిపై జరిగిన దాడి ఘటన నేపథ్యంలో శనివారం మహిళా కళాశాల ఎదురుగా కళాశాల విద్యార్థినులు ప్లకార్డులతో ధర్నా చేపట్టారు. తమకు రక్షణ కల్పించాలని, వార్డెన్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నినాదాలు చేశారు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే గొండు శంకర్ విద్యార్థినులతో మాట్లాడారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని, విద్యార్థినులకు కావాల్సిన వసతులు, సౌకర్యాలపై చర్చించేందుకు ధర్నా విరమించి వసతి గృహానికి రావాలని కోరారు. వార్డెన్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఎమ్మెల్యేను నిలదీశారు. నచ్చజెప్పేందుకు ఎమ్మెల్యే ప్రయత్నించినా విద్యార్థినులు లెక్కచేయకుండా కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించి, కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావుతో మాట్లాడారు. కళాశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఎవరి అనుమతితో విద్యార్థినులు ధర్నా చేశారని, వారికేమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రిన్సిపాల్‌తో సహా హాస్టల్ వార్డెన్లను ప్రశ్నించారు. తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, విద్యార్థినుల తల్లిదండ్రులను పిలిపించి సమావేశం నిర్వహించి, వివరణ తీసుకోవాలని సూచించారు. కాగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి బి.అనూరాధపై ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాలలో ఎన్ని హాస్టళ్లు ఉన్నాయి, ఎంతమంది విద్యార్థినులు ఉన్నారన్న ప్రశ్నలకు ఆమె సరైన సమాధానం చెప్పకపోవడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఘటన జరిగి రెండు రోజులైనా కనీస సమాచారం తెలియకుండా ఎలా విధులు నిర్వర్తిస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం బీసీ-3 వసతిగృహానికి ఇన్‌చార్జి వార్డెన్‌గా సరితను నియమించాలని ఆదేశించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

నాయకుల విగ్రహాలకు ముసుగులు

గార, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నోటిఫికేషన్ విడుదల కావడంతో మండలంలోని పలుకూడళ్ల ఉన్న రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు అధికారులు ముసుగులు వేయించారు. అలాగే ఫ్లెక్సీల తొలగింపు సిబ్బంది చేపట్టారు.

ప్రశాంతంగా సొసైటీ ఎన్నికలు

రణస్థలం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సాగర పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు శనివారం కొవ్వాడ, జీరుపాలేం గ్రామాల్లో ప్రశాంతంగా జరిగాయి. కొవ్వాడలో సంఘ అధ్యక్షుడిగా మైలపల్లి అప్పన్న, ఉపాధ్యక్షుడిగా బడి చిన్న, కార్యదర్శిగా సూరాడ లక్ష్మణ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి సత్యనారాయణ తెలిపారు. జీరుపాలంలో సంఘ అధ్యక్షుడిగా దుమ్ము కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా రాయితి ఎర్రయ్య, కార్యదర్శిగా మైలపల్లి చిన్న ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి సురేష్ తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జేఆర్ పురం సీఐ అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓర్పుతోనే లక్ష్యాన్ని సాధించొచ్చు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఓర్పు సహనంతోనే లక్ష్యాన్ని సాధించుకోవచ్చని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో శనివారం పోలీసు శాఖ నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి విద్యార్థినులతో మాట్లాడారు. ప్రస్తుత కాలంలో టెక్నాలజీ, సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఎంత ఉపయోగం ఉందో అంతే అనర్థాలు కలుగుతాయన్నారు. ఎటువంటి సమస్యలన్నా 63099 90800 ఫోన్ నెంబరులతో సంప్రదించాలన్నారు. విద్యార్థిని పై దాడి ఘటనలో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. విద్యార్థులు ధర్నాలకు దూరంగా ఉండాలన్నారు. డీఎస్పీ వివేకానంద, కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, ఉపాధ్యయులు తదితరులు పాల్గొన్నారు.

ఒడియా పాఠశాలల విలీనం మానుకోవాలి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఒడియా పాఠశాలల విలీనం మానుకోవాలని లేకుంటే ప్రజా ఉద్యమం తప్పదని ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ పాడి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒరియా లైబ్రరీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.117 రద్దు చేసి ఆ తర్వాత సంస్కరణల పేరుతో ఒడియా పాఠశాలలను తెలుగు మాధ్యమం పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు. ఇది ఇరు రాష్ట్రాలు గతంలో చేసుకున్న విద్యాపరమైన ఒప్పందాలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రఘునాథ్ గౌడో, కేశవ బెహరా, శ్రీనివాస్‌దాస్, శివప్రసాద్ పాల్గొన్నారు.

తరగతులను విలీనం చేయొద్దు

కంచిలి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం ప్రాథమిక పాఠశాల నుంచి 3,4,5 తరగతులను ఎస్ఆర్‌సీ పురం పాఠశాలలో విలీనం చేయొద్దని ఆ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబులను కలసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పైల పురుషోత్తం రెడ్డి, వంకల ప్రకాష్, పురుషోత్తం, వేణు, మోహన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళంక్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీత కార్మికులకు కేటాయించిన రెండు మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ ఎంవీ గోపాలకృష్ణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సెగిడి కులస్థులకు కార్పొరేషన్ పరిధిలో, సొండి కులస్థులకు శ్రీకాకుళం రూరల్ పరిధిలో కేటాయించామ న్నారు. సొండి కులస్థులు ఈ నెల 7లోగా, సెగిడి కులస్థులు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేటి నుంచి దర్శనం టికెట్ల విక్రయం

అరసవల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి వేడుకల సందర్భంగా స్వామివారి దర్శనానికి ఆదివారం నుంచి టికెట్లు విక్రయించనున్నట్టు ఆర్డీవో వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.100, రూ.300, రూ.500 టికెట్లు ఆలయ ప్రాంగణంలో గల కౌంటర్లో విక్రయిస్తామన్నారు. ఈ టిక్కెట్లు 3వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంట నుంచి 4వ తేదీ ఉదయం 6.00 గంటల వరకు ఈ టిక్కెట్ల అమ్మకం జరుగుతుందన్నారు. అలాగే రూ.300 దర్శనం టిక్కెట్లు యూనియన్ బ్యాంకులో లభిస్తాయన్నారు. ఈ టిక్కెట్లపై 4వ తేదీ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దర్శనం చేసేందుకు అనుమతిస్తారన్నారు.

4న మాంసం దుకాణాలు మూసివేయాలి

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రథసప్తమి పర్వదినం సందర్భంగా ఈ నెల 4వ తేదీ మంగళవారం నగర పరిధిలోని మాంసం, చేపల దుకాణాలు మూసివేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీ ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీగా అపరాధ రుసుంతోపాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పథకం ప్రకారమే హతమార్చారు

- జిల్లాలో రెండు హత్యకేసుల మిస్టరీని ఛేదించిన పోలీసులు
- వివాహేతర సంబంధాలే కారణమని నిర్ధారణ
- పలాస, ఆమదాలవలసలో ఘటనలు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీలు

జిల్లాలో పలాస, ఆమదాలవలసలో జరిగిన హత్యల మిస్టరీ వీడింది. ప్లాన్ ప్రకారమే ఈ రెండు హత్యలు చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. వివాహేతర సంబంధాలే ఈ హత్యలకు కారణమని తేల్చారు. ఈ రెండు కేసుల్లో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను సంబంధిత డీఎస్పీలు శనివారం విలేకరులకు వెల్లడించారు. ఆ వివరాలిలా ఉన్నాయి..

స్నేహితుడే చంపేశాడు

పలాస, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కోసంగిపురం-కొండలోగాం రోడ్డులో ఓ యువకుడి మృతి మిస్టరీ మూడు రోజుల తరువాత వీడింది. ఇది సాధారణమైన మరణం కాదని, హత్యచేసి పొలాల్లో పడేశారని పోలీసులు నిర్ధారించారు. తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో స్నేహితుడే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడని డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులకు వివరాలను ప్రకటించారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పారి శ్రామికవాడలో ఓ జీడి పరిశ్రమలో సవర యేసేసు జాన్, కామటి శ్రీనివాస్ పనిచేస్తున్నారు. వీరిద్దరూ మంచి స్నేహితులుగా గుర్తింపు పొందారు. యేసేసు జాన్‌కు వివాహం కాగా, శ్రీనివాస్ అవివాహితుడు. ఈ క్రమంలో తరచూ జాన్ ఇంటికి శ్రీనివాస్ వస్తుండడంతో ఆయనపై జాన్ అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌ను ఏ విధంగానైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఇద్దరూ సారా తాగేందుకు గతనెల 24న సాయంత్రం గిరిజన గ్రామమైన కొండలోగాంకి చేరుకున్నారు. అక్కడ పూటుగా ఇద్దరూ తప్ప తాగి తిరిగి వస్తుండగా కోసంగిపురం ప్రభుత్వ ఇళ్లసముదాయం వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో వీరిద్దరూ ఘర్షణకు దిగారు. తన భార్యతో నీకు వివాహేతర సంబంధం ఉందని, ఇది తగదని సదరు వ్యక్తి పేర్కొనగా ఇద్దరూ వాగ్వాదం, తోపులాటకు పాల్పడ్డారు. ఈ క్రమంలో శ్రీనివాస్ కింద పడిపోగా ఇదే అదనుగా అక్కడున్న ఐరన్ పైపుతో బలంగా కొట్టడంతో శ్రీనివాస్ పడిపోయాడు. అతను చనిపోయాడని తెలుసుకొని అక్కడి నుంచి యేసేసు జాన్ ఉడాయించాడు. జనవరి 26వ తేదీ రాత్రి మృతదేహం గుర్తుపట్టేందుకు వీలులేకుండా ఉందని ఫిర్యాదు రావడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని తప్ప తాగి రోడ్డుపై వస్తుండడంతో ఏదైనా వాహనం ఢీకొని ఉండవచ్చనే అనుమానంతో ముందుగా అనుమానాస్పద కేసుగా నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.


పలాస: వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటఅప్పారావు, వెనుక నిందితుడు

మిస్టరీ వీడింది ఇలా..

మంచి స్నేహితులైన శ్రీనివాస్, యేసేసుజాన్ గతనెల 24న ఇద్దరూ కలిసే సారా సేవించేందుకు వెళ్లి తిరిగి ఒక్క యేసేసుజానే రావడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. దీనిపై చుట్టు పక్కల వారితో పాటు వారికి పరిచయం ఉన్న వ్యక్తులను ప్రశ్నించడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. పోలీసులు యేసేసు జాన్‌పై నిఘా పెట్టారు. తనకోసం పోలీసులు వెతుకుతున్నారని తెలుసు కున్న జాన్ స్థానిక వీఆర్వో ద్వారా పోలీసులకు లొంగిపోయాడు. హత్య వ్యవహారాన్ని వివరించడంతో పోలీసుల అనుమానం నిజమైంది. వెంటనే జాన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. కేసు మిస్టరీ ఛేదించిన పోలీసులను అభినందించారు. సమావేశంలో సీఐ పి.సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యే సూత్రధారి

ఆమదాలవలస, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మూడుముళ్ల బంధంతో ఏడడుగులు నడిచి.. జీవితాంతం ఒక్కటిగా ఉందామని ప్రమాణం చేసిన భార్యే తన భర్తను చంపించిన ఘటన వెలుగుచూసింది. గత నెల 25న బొబ్బిలిపేట గ్రామ సమీపంలో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ వివరాలను ఆమదాలవలస సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద వెల్లడించారు. బొబ్బిలిపేటకి చెందిన గురుగుబిల్లి చంద్రయ్య గత నెల 25వ తేదీ రాత్రి గ్రామ సమీపంలోని చెరువు వద్ద హత్యకు గురయ్యాడు. ఈ కేసులో పది మంది ప్రమేయం ఉన్నట్టు పోలీసు విచారణలో గుర్తించారు. చంద్రయ్య భార్య ఈశ్వరమ్మకు అదే గ్రామానికి చెందిన చింతాడ బాలమురళీకృష్ణతో గత కొన్నాళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం తెలుసుకున్న చంద్రయ్య భార్యను మందలించాడు. ఆమె సెల్‌ఫోన్ వాడకుండా కట్టుదిట్టం చేశాడు. అలాగే, బాలమురళీకృష్ణతో ఉన్న ఆర్థిక లావాదేవీలను కూడా నిలుపుదల చేశాడు. ఈ క్రమంలో ఈశ్వరమ్మ వేరే ఫోన్‌తో రహస్యంగా బాలమురళీకృష్ణతో సంభాషణలు కొనసాగిస్తుండేది. ఈ నేపథ్యంలో తమకు అడ్డంకిగా ఉన్న చంద్రయ్యను తొలగించుకోవాలని నిర్ణయించుకున్న బాలమురళీకృష్ణ.. తన సోదరుడైన ఇదే మండలం శ్రీనివాసచార్యులపేటలో నివాసం ఉంటున్న గురుగుబిల్లి అరవింద్‌కు విషయం చెప్పాడు. చంద్రయ్యను హతమార్చడానికి సహకరించాలని కోరాడు. దీంతో బూర్జ మండలం ఉప్పినివలస గ్రామానికి చెందిన గొల్లపల్లి వంశీ, సవలాపురం గణేష్‌లను బాలమురళీకృష్ణకు అరవింద్ పరిచయం చేశాడు. వీరందరూ కలిసి చంద్రయ్యను హతమార్చేందుకు మరి కొందరి సాయంతో పథకం రచించారు. దీంతో స్థానిక ఓ దాబాలో పూటుగా మద్యం తాగారు. బొబ్బిలిపేట సమీపంలోని చెరువు వద్ద రెండుసార్లు మాటువేసినా పథకం విజయవంతం కాలేదు. దీంతో గత నెల 25వ తేదీ రాత్రి తన కుమార్తెను ఆమదాలవలస బ్రిడ్జి నుంచి తీసుకువచ్చేందుకు చంద్రయ్య ఇంటి వద్ద స్కూటీపై బయలుదేరాడు. ఈ విషయాన్ని భార్య ఈశ్వరమ్మ అప్పటికే చెరువు వద్ద మాటు వేసి ఉన్న బాలమురళీకృష్ణకు ఫోన్ చేసి చెప్పింది. ఈ క్రమంలో స్కూటీపై వస్తున్న చంద్రయ్యను అటకాయించి బీరు సీసాతో బలంగా తలపై కొట్టారు. దీంతో వాహనం అదుపు తప్పి చంద్రయ్య కింద పడిపోయాడు. ఇదే అదునుగా బీరుసీసాలు, కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేయడంతో ఆయన మృతి చెందాడు. అనంతరం మృతదేహం పీకకు కవరును బిగించి రోడ్డుపై ఈడ్చుకుంటూ చెరువులోని తుప్పల మాటున పడేసి వెళ్లిపోయారు. భార్య ఈశ్వరమ్మ ఏమీ ఎరగనట్టు తన భర్త కనిపించడం లేదని అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మళ్లీ అర్ధరాత్రి సమయంలో చెరువు వద్ద పొదల్లో తన భర్త మృతదేహం ఉన్నట్టు సమాచారం అందించింది. దీంతో వెంటనే ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ ఎస్.బాలరాజు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మరుసటి రోజు ఉదయం క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. అనంతరం తమదైన శైలిలో పోలీసులు విచారణ చేపట్టడంతో హత్యకు గల కారణాలు బయటపడ్డాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు చింతాడ బాలమురళీ కృష్ణతో పాటు వంశీ, గణేష్, చంద్రయ్య భార్య ఈశ్వరమ్మ, సవలాపురం ప్రవీణ్, బొమ్మాళి శ్రీవర్ధన్, బొమ్మాళి ఉమామహేశ్వరరావు, యరల్లంకి కృష్ణ, గురుగుబెల్లి అరవింద్‌తోపాటు ఓ మైనరును అరెస్టు చేసి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చారు. వారికి రిమాండ్ విధించినట్టు డీఎస్పీ తెలిపారు. కాగా, చంద్రయ్య హత్య కేసులో ఎటువంటి రాజకీయ కోణం లేదని, కేవలం అతడి భార్య వివాహేతర సంబంధమే కారణమని డీఎస్పీ స్పష్టం చేశారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద, వెనుక నిందితులు

క్రైం కార్నర్

పశువులతో లారీ పట్టివేత

సోంపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా ఒడిశా నుంచి హైదరాబాద్ తరలిస్తున్న పశువుల లారీని బారువ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్ఐ హరి బాబునాయుడు తెలిపిన వివరాల మేరకు.. జాతీయ రహదారిపై కొర్లాం వద్ద హసన్ నశీబ్, మహ్మద్ నమి లారీపై పశువులను తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. పట్టుబడిన సుమారు పది పశువులను బారువలోని గోశాలకు తరలించినట్టు చెప్పారు.

మహా కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

టెక్కలి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న మహా కుంభమేళా (ప్రయాగ్‌రాజ్) కు టెక్కలి, పలాస డిపోల నుంచి కొత్త సూపర్ లగ్జరీ బస్సులతో సర్వీసులు నడపనున్నట్లు టెక్కలి డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ బస్సులు ఈనెల 12న మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి నేరుగా ప్రయాగ్ రాజ్‌కు చేరుకుంటాయన్నారు. పవిత్ర స్నానాలు ఆచరించిన తరువాత తిరుగు ప్రయాణంలో త్రివేణి సంగమం, కాశీ విశ్వేశ్వరస్వామి, జ్యోతిర్లింగం, అన్నపూర్ణ, విశాలాక్షి, బుద్ధుడు జ్ఞానోదయం పొందిన మహాబోధి ఆలయం, శ్రీవిష్ణుపాద ఆలయం, మంగళగౌరీ శక్తిపీఠం, కోణార్క్, పూరీ జగన్నాథ స్వామి ఆలయం, భువనేశ్వర్ లింగరాజు స్వామి దేవాలయాల దర్శనం చేసుకుని ఏడో రోజు సాయంత్రం తిరిగి టెక్కలి చేరుకోనున్నట్లు తెలిపారు. ప్రయాణ సమయంలో అల్పాహారం, భోజనంతో కలిపి మనిషికి ఒక్కింటికి రాను, పోను రూ.9,500 చార్జీలు వసూలు చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరా లకు 99592 25611, 73829 23311, 73829 23507 నెంబరలో సంప్రదించాలని కోరారు.

సిగ్నల్ సమస్యతో వినియోగదారుల ఇక్కట్లు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బోరుభద్రలోని బీఎస్ఎన్ఎల్ టవర్ పరిధిలో సిగ్నల్ సమస్యతో ఫోన్‌లు పనిచేయడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల ఈ టవర్‌ను 3జీ నుంచి4జీకి అప్‌గ్రేడ్ చేసినప్పటి నుంచి మొబైల్ డేటా పనిచేస్తున్నా ఫోన్లు పనిచేయక పోవడంతో సమాచారం తెలిపేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాపోతున్నారు. ఎవరికి కాల్ చేస్తున్నా సైలెంట్‌గా ఉండిపోతోంది తప్ప కాల్ కలవడం లేదని సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

30 గొర్రెలు మృత్యువాత


మృతిచెందిన గొర్రెలు

టెక్కలి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గూడేం పంచాయతీ పిట్టలసరియా గ్రామంలో శనివారం 30 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. గ్రామానికి చెందిన గండేటి అప్పలస్వామికి చెందిన గొర్రెలు మేతకు వెళ్లి పొలంలో ఉన్న ధాన్యం తినడంతో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాయి. దీంతో బాధిత కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. మృతిచెందిన గొర్రెలను సంబంధిత అధికారులు పరిశీలించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే కుష్ఠు వ్యాధి నిర్మూలన


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

జలుమూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే కుష్ఠువ్యాధి నిర్మూలన సాధ్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం జిల్లా స్థాయి లెప్రసీ హెల్పింగ్ హ్యాండ్ కార్యక్రమంలో పాల్గొని రోగులకు దాతలు అందించిన దుప్పట్లు, పండ్లు, ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నేటికీ కుష్ఠువ్యాధిపై అపోహలున్నాయని, వాటిని తొలగించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వోలు తాడేల శ్రీకాంత్, మేరీ కేథరిన్, వైద్యాధికారి వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపు

పలాస/పాతపట్నం/మెళియాపుట్టి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో నేతల బ్యానర్లు, ఫ్లెక్సీలు, జెండాలను సిబ్బంది తొలగిస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు నేతల విగ్రహాలకు ముసుగులు తొడిగారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు

టెక్కలి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు కొనసాగుతున్నాయి. టెక్కలి మండలం కె. కొత్తూరులో శ్రీరామమందిర పునఃప్రతిష్ఠలో భాగంగా శనివారం స్వామి ఉత్సవ మూర్తికి తిరువీధి చేపట్టారు. ఆదివారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ చేపట్ట నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం సీతారాముల కల్యాణం, అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.


హరిపురం: హోమం చేపడుతున్న వేదపండితులు


టెక్కలి: సీతారాముల తిరువీధి దృశ్యం

బిన్నలమదనాపురంలో..

హరిపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బిన్నల మదనాపురం గ్రామంలో సీతారామాలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సింహాచలం దేవస్థానం వేదపండితులు ముప్పిరాల నారాయణస్వామి ఆధ్వర్యంలో ధ్రువమూర్తుల ఊరేగింపు, పుణ్యహావాచనం, రుత్విక్ వరుణం, యాగశాల ప్రవేశం, అంకురార్పణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో భక్త జన కమిటీ సభ్యులు మార్పు మన్మథరావు, మార్పు నారాయణమూర్తి, మాధవరావు, వెంకటేశం తది తరులు పాల్గొన్నారు.

కృష్ణరాయపురంలో..

నందిగాం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బోరుభద్ర పంచాయతీ కృష్ణరాయపురంలో వేపపోలమ్మతల్లి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు రెండోరోజు శనివారం సందడిగా సాగాయి. పురోహితుడు తెలికి చర్ల ప్రసాదరావు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, ధాన్యాధి, సయ్యాధి వాసాలు నిర్వ హించారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ, అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. అలాగే పాలవలసపేట ఉద్దండభర్తుపురంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో భాగంగా శనివారం స్థానిక మహిళలతో తమలపాకులు, కుంకుమ, సింధూర పూజలు నిర్వహించారు.


నందిగాం: పాలవలసపేట ఉద్దండభర్తుపురంలో పూజలు చేస్తున్న మహిళలు

జాతీయ విద్యా సదస్సులో జలుమూరు వాసి



జలుమూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మైసూరులో నిర్వహించిన జాతీయ విద్యా సదస్సులో శ్రీముఖలింగం గ్రామానికి చెందిన అల్లు అప్పన్నకు అవకాశం లభించింది. విద్యార్థులకు అవసరమైన కెరీర్ గైడెన్స్ ఆవశ్యకతపై గత మూడు రోజులుగా జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహించిన సదస్సులో పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి 78 మంది ప్రతినిధులు పాల్గొనగా అందులో అల్లు అప్పన్న ఒకరు. ప్రస్తుతం వమరవెల్లి డైట్‌లో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

జొన్నాం-డోల గ్రామాల మధ్య బీటీ రోడ్డు

పోలాకి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వనితమండలం పరిధి జొన్నాం గ్రామం నుంచి డోల గ్రామాన్ని కలుపుతూ బిటీటీ రహదారి నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మండల ఇంజనీర్ మోహనరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బీటీ రహదారి నిర్మాణానికి సిఫారసు చేశారన్నారు. సుమారు రూ.కోటి వ్యయంతో ఈ నిర్మాణం జరుగుతుందన్నారు. ఏఈ అప్పారావు, సిబ్బంది ఉన్నారు.

రోగుల్లో విశ్వాసం పెంచాలి: డీసీహెచ్ఎస్

పాతపట్నం, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): సీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలతో విశ్వా సం పెంచాలని డీసీహెచ్ఎస్ డా. కల్యాణ్‌బాబు అన్నారు. స్థానిక 50 పడకల సామాజిక ఆసుపత్రిని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికలను, ఓపీ, ఐపీ, ఆరోగ్యశ్రీ తదితర రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డా.జి వేణు గోపాలరావు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు చర్యలు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శాఖా గ్రంథాలయానికి అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు అన్నారు. శనివారం స్థానిక శాఖాగ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రేడ్ వన్ డిప్యూటీ లైబరీ వీవీజీఎస్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సారా నియంత్రణకు 14405

పలాసరూరల్/వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో సారా రవాణా, తయారీ, అమ్మకాలు జరుగుతుంటే, వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు 14405కు సమాచారం అందించాలని ఎక్సైజ్‌శాఖ సీఐ కె.మల్లికార్జునరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ నెంబరుకు సమాచారంతో ఎటువంటి రుసుం ఉండదన్నారు. ఈ విషయమై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని లక్ష్యాలను చేరుకోవాలని సత్య సాయి సేవాసంస్థల జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు తెలిపారు. కరకవలస ఉన్నత పాఠశాల, లక్ష్మీనర్సుపేట కేజీబీవీల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున సమయాన్ని వృథా చేయకుండా చదవాలన్నారు. ఏకాగ్రత కోల్పోవద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం పిరామారావు, ప్రత్యేకాధికారి ఎం.వెంకట అంబిక తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న సోలార్ విద్యుత్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సెర్ప్ ఏపీఎం జి.ప్రసాదరావు అన్నారు. శనివారం కూర్మనాథపురంలో ఎస్‌హెచ్‌జీ మహిళలతో సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పేరుతో ఈ పథకం అమ వుతున్నట్లు చెప్పారు. ఇంటి పైకప్పుపై సోలార్ పలకల ఏర్పాటుకు బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలందిస్తాయన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మెళియాపుట్టి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో ప్రసాద్‌పండా తెలిపారు. శనివారం చాపర జడ్పీ హైస్కూల్‌లో చేపడుతున్న పనులను పరిశీలించారు. పల్లె పండగ పనులు పూర్తి చేయాలన్నారు.

'ఫీజుపోరు'ను జయప్రదం చేయండి

నందిగాం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఈనెల 5న చేపట్టనున్న ఫీజుపోరును విజయవంతం చేయాలని వైసీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేడాడ తిలక్ కోరారు. పార్టీ కార్యాలయంలో శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. నందిగాం ఎంపీపీ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సర్వర్ల సమస్య

నందిగాం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సర్వర్ల సమస్య ఏర్పడింది. 22 సచివాలయాల పరిధిలో 9,633 వివిధ రకాల పింఛన్ల పంపిణీకి ఉదయానికే డీపీవోలు చేరుకున్నప్పటికీ సర్వర్ పని చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. 10 గంటల తరువాత సమస్య పరిష్కారం కావడంతో సాయంత్రానికి 93 శాతం పంపిణీ పూర్త య్యిందని ఎంపీడీవో టి.రాజారావు తెలిపారు.

ఉద్యోగులకు భారీ ఊరట

(ఏడో పేజీ తరువాయి)

కూటమి ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఇతర రాజకీయ పార్టీల నేతలు మాత్రం బడ్జెట్‌పై పెదవి విరుస్తున్నారు. ● జిల్లాకు 'డే కేర్ కేన్సర్ సెంటర్ నెలకొల్పనున్నట్లు ప్రక టించడంతో రోగులకు కాస్త ఉపశమనం లభించనుంది. జిల్లా లో కేన్సర్ రోగులు మెరుగైన వైద్యం కోసం విశాఖ, హైదరా బాద్, చెన్నై తరలివెళ్తున్నారు. ఆరోగ్యశ్రీ పరిధి కూడా కొంత వరకే ఉండటంతో మందుల ఖర్చుకూడా భరించలేక పోతున్నారు. ఇందుకు సంబంధించిన మందులు కూడా అధిక ధరలు పలుకుతున్నాయి. కాగా ప్రతి జిల్లా ఆసుపత్రిలో 'డే కేర్ కేన్సర్ సెంటర్' ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించడంతో.. శ్రీకాకుళంలో సర్వజన ఆసుపత్రి(రిమ్స్) లేదా టెక్కలిలోని జిల్లా ఆసుపత్రిలోనైనా దీనిని ఏర్పాటు అయ్యే అవకాశముంది. అలాగే 36 రకాల మందుల ధరలను కూడా తగ్గించేందుకు చర్యలు తీసుకున్నట్లు ప్రకటించారు. దీనివల్ల మరింత ఆర్థికంగా కేన్సర్ రోగులకు పరోక్షంగా లబ్ధి కలుగుతుంది. ● రాష్ట్రానికి ఏడు ఎయిర్‌పోర్టులు ప్రకటించారు. ఇందులో స్పష్టంగా జిల్లా పేరు చెప్పనప్పటికీ.. ఇది వరకు కేంద్రపౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పలాసలో ఎయిర్‌పోర్టు నెలకొల్పుతామని స్పష్టంచేశారు. భూ సేకరణ కోసం అధికారులు సర్వే చేస్తున్నారు. ప్రస్తుత ప్రకట నతో.. జిల్లాలో ఎయిర్‌పోర్టు పట్టాలెక్కే అవకాశం ఉంది. ● జల్‌జీవన్ మిషన్ పనులు మార్చినాటికి పూర్తిచేయాల్సి ఉంది. వీటి గడువు మరో మూడేళ్లు పెంచడంతో మరింత నాణ్యతతో పనులు చేపట్టే అవకాశం ఉంది. ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు సాధ్యం కానుంది. ● ప్రస్తుతం సహజ వ్యవసాయాన్ని ప్రభుత్వాలు రైతులకు చేరువ చేస్తున్నాయి. పురుగు మందులు, రసాయనాలు వినియోగించకుండా సహజ పద్ధతిలో పంటలను పండించేందుకు భారీగా ప్రోత్సా హమిచ్చేందుకు రాష్ట్రానికి రూ.186 కోట్లు కేటాయించింది. దీనివల్ల జిల్లాకు భారీఎత్తున వాటా లభించనుంది. ఇప్పటికే మూడు మండలాల్లో కొన్ని గ్రామాలను 'జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్'కు ఎంపిక చేసి పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పుడు మరిన్ని గ్రామాలకు చేరువకానుంది. అలాగే రైతుల రుణ పరపతిని ప్రభుత్వం పెంచింది. కిసాన్ క్రెడిట్ రుణాలతో భారీగా రుణాలను ఇవ్వనుంది. అలాగే ఎస్సీ, ఎస్టీల మహిళలకు రుణాలు ఇచ్చేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చారు.

రాష్ట్రానికి సముచిత స్థానం



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సముచిత స్థానం ఇవ్వడం బాగుంది. పోలవరం, విశాఖ పోర్టు అభివృద్ధికి నిధులు కేటాయించడం హర్షనీయం. దగాపడ్డ రాష్ట్రానికి ఈ బడ్జెట్‌లో కేంద్రం ఆదుకుంది. వికసిత్ భారత్ ప్రధాన లక్ష్యంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి.

-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే, నరసన్నపేట

చాలా బాగుంది



కేంద్ర బడ్జెట్ చాలా బాగుంది. రూ.12 లక్షల ఆదాయం పొందేవారికి పన్ను మినహాయిస్తూ వేతన జీవులకు ఊరట నిచ్చింది. ఉద్యోగుల సంక్షేమానికి భరోసా కల్పించి ఉంటే బాగుండేది.

సదాశివుని రాంబాబు, ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నరసన్నపేట

చారిత్రాత్మకం



రూ.12లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయించడం చారిత్రాత్మకం. దీనివల్ల మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనం కలుగుతుంది. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బడ్జెట్ ఇది.

- పైడి వేణుగోపాలం, బీజేపీ రాష్ట్ర నాయకుడు

అభినందనీయం



వికసిత్‌భారత్ ప్రతిబింబించే విధంగా కేంద్ర బడ్జెట్ ఉంది. రాష్ట్రంలో ఏడు ఎయిర్‌పోర్టులు, ఆరు లైన్ల జాతీయ రహదారులు, పోలవరం, విశాఖస్టీల్ పోర్టులకు మహర్దశ పట్టే విధంగా బడ్జెట్ రూపొం దించడం అభినందనీయం.

-వజ్జ బాబూరావు, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, పలాస

నిధులు వచ్చాయి



జల్‌జీవన్ మిషన్ పనుల గడువును మూడేళ్లు ఇచ్చారు. దీనివల్ల లక్ష్యం సాధిం చేందుకు వీలవు తుంది. జిల్లాలో అన్ని గ్రామాలకు ఇంటింటికీ కొళాయిల ద్వారా తాగునీరు అందనుంది. రాష్ట్రానికి అన్ని విధాలా బడ్జెట్‌లో నిధులు లభించాయి. అందరికీ ఉపయోగపడే బడ్జెట్.

-కలమట వెంకటరమణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

హోదా ఇవ్వలేదు



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపారు. ప్రత్యేక హోదా ఇవ్వలేదు. ప్రత్యేక ప్యాకేజీ విడుదల చేయలేదు. విభజన హామీలు నెరవేర్చలేదు. వివిధ రంగాలకు కేటాయింపుల కూడా గతం కంటే ఇప్పుడు భారీగా తగ్గించేశారు. జిల్లాకు పెద్దగా ప్రయోజనం లేదు.

- గోవిందరావు, జిల్లా సీపీఎం కార్యదర్శి

కంటితుడుపు..



ఇది కంటి తుడుపు బడ్జెట్. సామాన్యులకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదు. ప్రత్యేక హోదా, రైల్వేజోన్, రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించలేదు. నిరుద్యోగుల గురించి ఆలోచించలేదు. ఈ బడ్జెట్ వల్ల ప్రయోజనం శూన్యం.

-అంబటి కృష్ణారావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, శ్రీకాకుళం

రైతులకు లబ్ధి



ఇదివరకు బ్యాంకు రుణాలు రైతులకు అవసరమైనంతగా లభించేవి కాదు. రూ. 3 లక్షలు లోపే ఇచ్చేవారు. రైతులకు రుణ పరపతిని రూ.5లక్షల వరకు పెంపుదల చేయడం హర్షణీయం. దీనివల్ల నేరుగా రైతులకు లబ్ధి కలుగు తుంది. దేశంలోనే యూరియా తయారీ చేయడం ద్వారా రైతాంగానికి తగినంతగా సహకారం అందుతుంది.

-గొండు శంకర్, ఎమ్మెల్యే, శ్రీకాకుళం